ఉచిత పోలీస్ కోచింగ్‌కు భారీ స్పందన




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

మల్లంపల్లిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ....




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 230 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 15 ఆగస్టు 2026




# రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

- వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి
- జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):**భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వాతంత్య దినోత్సవ వేడుకలతో మిగతా2లో...

## పూలే విధానాలతో

# ముందుకెళ్తున్నాం

- ‘ఫీజు’ కోసం ఏటా రూ.2,400 కోట్లు
- దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే విద్యార్థుల ఖాతాల్లో జమ
- పిల్లలను కుల వృత్తులకే పరిమితం చేసేందుకు యత్నించిన బీఆర్ఎస్
- పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** మహాత్మా జ్యోతిబా పూలే విధానాలతో తమ ప్రభుత్వం ముందుకెళుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం విద్యార్థులెవరూ ఇబ్బంది పడకుండా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ముందుగానే రూ.2,400 కోట్లను కేటాయించామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థికి నెల రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని భరోసానిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఖైరతాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ సమీపంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో

మిగతా2లో...



# బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

- భౌతికి కాయం వద్ద నివాళులు

హైదరాబాద్,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్): అనారోగ్యంతో మరణించిన తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు పార్థీవ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళు లర్పించారు. ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని

మిగతా2లో...

## డిసెంబర్‌లో తెలంగాణ

# రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- ఇన్వెస్ట్ తెలంగాణ’ థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం






# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- పార్టీ వేదికల్లో మాత్రమే చెప్పాలి
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం మిగతా2లో...

## ఇకనుంచి

# స్మార్ట్ రేషన్ కార్డులు

- ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా ఏర్పాటు
- నేడు సంగారెడ్డిలో సిఎం చేతుల మీదుగా విడుదల




**సంగారెడ్డి,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారు తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వచ్చారు. సంగారెడ్డిలో శనివారం పంద్రాగస్ట్ పురస్కరించుకుని సిఎం రేవంత్ రెడ్డి స్మార్ట్ కార్డును పంపిణీ చేయనున్నారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్డులు అందచేయనున్నారు. సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. స్థాని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలే లబ్దిదారులకు రేషన్ కార్డులుగా ఉపయోగపడుతూ వచ్చాయి. జిరాక్స్ కాగితాలు చినిగిపోతూ ఇబ్బంది పడుతున్న లబ్దిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పంద్రా గస్టు రోజు నుంచి సరి కొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ముద్రణ పూర్తి చేసు కున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు. స్వాతంత్య దినోత్సవం రోజున సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారం భించిన వెంటనే లబ్దిదా రులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫ రాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గతంలో దారిద్య రేఖకు మిగతా2లో...

# రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

- సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత




# సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శ




## నిరసన తెలిపే హక్కు

# విద్యార్థులకు ఉంది

నల్సార్ ఘటనపై బిసిఐ జోక్యం సరికాదు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



# పూలే విధానాలతో ముందుకెళ్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన పిల్లలను ఆయా కులవృత్తులకే పరిమితం చేసేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అందుకు భిన్నంగా ఆయా వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదివేలా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. అంటరానితనం, ఆకలికేకలు, మూఢ నమ్మకాలు, మహిళకు చదువు అనేది ఊహకందని కాలంలోనే పూలే చదువుకోవటమేగాక, తన సతీమణిని కూడా చదివించారని సీఎం గుర్తు చేశారు. చదువు విలువ తెలిసిన పూలే దంపతులు భవిష్యత్తును ముందుగానే ఊహించి, చిరస్మరణీయులయ్యారని కొనియాడారు. కుల నిర్మూలనకు సామాజిక చైతన్యం అవసరమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఆ దిశగా తమ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కులాల పిల్లలు వేర్వేరుగా కుండా ఒకే దగ్గర చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూపకల్పన చేయబోతోందని తెలిపారు. చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అలాంటి వారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాల్లో అవకాశాలను ఇప్పించే బాధ్యత తమదని ప్రకటించారు. క్రీడల్లో రాణించే వారికి నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపిస్తున్నదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణాయేనని చెప్పారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం కులగణన చేసిన తర్వాత మళ్లీ కులగణన చేసిన ప్రభుత్వం కూడా తమదేనని వివరించారు. శాస్త్రీయ సర్వేతో బలహీనవర్గాల లెక్కలు తేల్చి కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసిరామని అన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, కోర్టుల ద్వారా ఆపాలని ప్రయత్నించినా, అసెంబ్లీలో ఆటంకాలు సృష్టించినా తాము వెనుకడుగు వేయలేదన్నారు. గొప్పలు చెప్పుకునే మోడీ గుజరాత్ లో వర్గీకరణను అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో జనగణనతో పాటు కుల సర్వే చేయడాన్ని తాము తప్పనిసరి చేశామన్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవంగా పాటిస్తున్నట్లు తెలిపారు. 'చదువు తలరాతను మారుస్తుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంది. దేశ ప్రతిష్టను ప్రపంచంలో పెంచుతుంది. పూలే చెప్పిందిదే. నాణ్యమైన విద్యనందించే బాధ్యత నాదే. తల్లిదండ్రులకు భారం కానివ్వకుండా విద్యార్థులు చదివినంత మేరకు చదివించేందుకు తాము సిద్ధంగా ఉన్నాం...' అని సీఎం హామీ ఇచ్చారు. ఈ సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు విహెచ్, కేకే, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

**హైదరాబాద్,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు.

# నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

**న్యూఢిల్లీ,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ (ఏబీబబితిఇ౹ ÷ూబీసాజీ ఐజీనిబి)ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (÷ూఅః౦) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. 'ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వా÷-లెవరు..?' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.



# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

- పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు



**హైదరాబాద్,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి. ప్రతి ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

# రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

యవాత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె.. న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోక్‌సభ్‌లో మొట్టమొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్–2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

## - సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత

**న్యూఢిల్లీ,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వినాయక్ దామోదర్ సావర్కర్‌పై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన క్రిమినల్ పరువునష్టం కేసును సుప్రీంకొట్టివేసింది. ఈ కేసులో అంతకుముందు లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను కూడా కోర్టు రద్దు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షిల్ నాగుతో కూడిన ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణకు అవసరమైన అనుమతిని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి పొందలేదని, అందువల్ల ఇది విచారణార్హం కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీంతో రాహుల్‌పై నమోదైన క్రిమినల్ పరువునష్టం కేసును కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై తమ అనుమతి తీసుకున్నట్టు ఎలాంటి ఆధారాలు తమ వద్ద లేదని చెబుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022, నవంబర్ 17న మహారాష్ట్రలోని అకోలాలో పర్యటిస్తుండగా రాహుల్ గాంధీ.. సావర్కర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. అయితే, రాహుల్ ఉద్దేశపూర్వకంగా సావర్కర్ గౌరవాన్ని తగ్గించే లక్ష్యంతోనే ఈ వ్యాఖ్యలు చేశారని, ఆయన పరువుకు భంగం కలిగించారని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే లాయర్.. రాహుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లక్నో కోర్టు దీనిపై విచారణ జరిపి, రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరారు. స్పందించిన సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనికి యూపీ ప్రభుత్వం బదులిస్తూ ఒక అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసులో రాహుల్ గాంధీపై 153 ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోదైందని, దీనిపై విచారణ జరిపేందుకు అవసరమైన అనుమతుల్ని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తీసుకోలేదని సుప్రీంకోర్టు గుర్తించింది. యూపీ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఈ వివరణ ఉంది. దీంతో రాహుల్ గాంధీపై నమోదైన పిటిషన్‌పై విచారణకు అర్హత లేదని భావిస్తూ.. సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టివేసింది. ఇదే సమయంలో.. స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన అంశాల్లో ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని రాహుల్‌కు సూచించింది.

# బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్ నివాళులు అర్పించిన అనంతరం శోకతప్తులైన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు.

ఆయన వెంట కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.

# సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

**హైదరాబాద్,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్టార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

దిగువ ఉన్నవారికి తెలుపు రంగు కార్డులు, ఎగువనున్నవారికి గులాబీ రంగు కార్డులు ఉండేవి. గులాబీ రంగు కార్డుదారులకు బియ్యం మినహా ఇతర సరుకులు పంపిణీ చేసేవారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీకి పరిమితం కావడంతో గత ప్రభుత్వం గులాబీ కార్డులను రద్దు చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా ఎలాంటి ట్యాంపరింగ్ చేయడానికి వీలులేని విధంగా ఏటీఎం, పాన్‌కార్డు మాదిరిగా డిజిటలైజేషన్, స్మార్ట్ టెక్నాలజీ ఆధారితంగా పంపిణీ చేసే పీవీసీ కార్డు, చిప్, బార్‌కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి టెక్నాల జీతో స్మార్ట్ రేషన్‌కార్డులు ముద్రించారు. కార్డు స్కాన్ చేయడంతో అందులో ఉన్న కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం వస్తుంది. ఆధునిక భద్రతా ఫీచ ర్లను పొందుపరచి స్మార్డ్ కార్డులు లబ్దిదారులను ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం రోజు నుంచి లబ్దిదా రులకు చేరనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే రేషన్ సరుకులు బయోమెట్రిక్ ద్వారా రేషన్ దుకాణాల్లో ఎక్కడైనా సరుకులు పొందే అవకాశం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో లబ్దిదా రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. స్మార్ట్ కార్డు ద్వారా రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణంలోనై నా సరుకులు పొందడానికి సులువుగా మారు తుంది. క్యూఆర్ కోడ్ ఉండడంతో కార్డులు డూప్లికేట్ కాకుండా ఉంటుంది. జిల్లాల్లో ప్రస్తుతం రేషన్‌కార్డు కలిగిన లబ్దిదారులందరికీ స్మార్ట్ కార్డులను రేషన్ షాప్‌లో పాత కార్డు చూపించి స్మార్ట్ కార్డును పొందవచ్చు. అంతే కాకుండా టీఎస్‌ఈపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కూడా స్మార్ట్ కార్డు తీసుకునే వీలు కల్పిస్తున్నారు. కొత్తగా అందించే స్మార్ట్ రేషన్ కార్డులు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, రేషన్ కార్డు నంబర్, రేషన్ దుకాణం నంబర్ ముద్రిస్తారు. కార్డు వెనకవైపు కుటుంబ సభ్యుల వివరాల తో పాటు ఇతర అవసరమైన సమాచారాన్ని పొందుపరిచారు.

# ఎవరికి స్వాతంత్ర్యం

ఆగస్టు14అర్ధరాత్రి వేళ
వచ్చిందంట స్వాతంత్ర్యం
ఎవరికి వచ్చింది. ఎవర్గాలకు
వచ్చింది స్వాతంత్ర్యం

దేశ మంత ప్రజలు
అద మరచి నిదురించే వేళ
బ్రిటిష్ తెల్ల దొరలనుండి
వచ్చింది అధికారం
బ్రాహ్మణ. బనియలకు
దాని పేరే స్వాతంత్రం అని చెప్పిండ్లు

భరత స్వాతంత్ర సమరంలో
బ్రిటిషోన్ని గడగడలాడించిన
ఝూల్కరిబాయి నుండి
ఆజాద్. భగత్ సింగ్ రాజగురు
సుఖదేవ్ సుభాష్ చంద్రబోస్ వరకు
వేలాది మంది ప్రాణ త్యాగం
బడుగు. బలహీన వర్గాలది
వచ్చింది స్వాతంత్రం బ్రాహ్మణ
బనియలకు ఆధిపత్య కులాలకు

ముందే పసిగట్టిండు అంబెద్కర్
బ్రాహ్మణ బనియల కుట్రలను



అధికార మార్పిడి జరగక ముందే
బ్రిటిష్ పాలకులతో కొట్లాడి
ఈ దేశ ప్రజలు బడుగు బలహీనవర్గాలకు
సాధించిపెట్టిండు ఓటు హక్కు
రిజర్వేషన్. కార్మిక హక్కులను
మహిళహక్కులను

దెబ్బదితొమ్మిది ఏళ్ల
స్వాతంత్ర భారతవనిలో
నిర్మూలించబడలేదు నేటికీ
పేదరికం. అంటరానితనం
కులం పేర దళితులపై దాడి
మతం పేర ముస్లిం. క్రైస్తవులపై దాడి
మహిళలపై అత్యాచారాలు. హత్యలు
తిండి పెట్టె రైతు కూలీల
ఆకలి కేకలు ఆత్మ హత్యలు

ప్రపంచంలోకెల్ల ప్రజాస్వామ్యం లేని
అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం
పేరుకే భారత రాజ్యాంగం
అమలాయ్యేది మను ధర్మం
ఇక్కడ ప్రశ్నిస్తే నేరం
తమ హక్కులకై నిరసన తెలిపితే
దేశ ద్రోహం. రాజద్రోహం. ఉపా చట్టం
లాఠీలా దెబ్బలు తుపాకుల మోతలు
ఇది నేటి భారతం

నాటి నుండి నేటి వరకు
అభివృద్ధి చెందుతూనే ఉంది
భారతదేశం ఆరవ దేశంగా
అదని అంబానీ జిందల్ ఎస్ ఆర్
బడా బాబుల ఆస్తులు పెరగడంలో
ఎక్కడ ఎసిన గొంగళి అక్కడే ఉన్నట్టు
మారలేదు పేదల బతుకులు
దెబ్భై తొమ్మిది స్వాతంత్ర దేశంలో

– శ్రీహరి


# మల్లంపల్లిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ....

● మల్లంపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించిన భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్....





**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి జాతీయ రహదారి–163లోని అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని బస్టాండ్ మీదుగా తిరిగి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో మల్లంపల్లి మండల కేంద్రం మారుమోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం, మండల ఇన్‌చార్జి జీనుకాల కృష్ణకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. దేశ భద్రత, భవిష్యత్ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలసీ అండ్ రీసెర్చ్ కో–కన్వీనర్ స్వరూప, జిల్లా జనరల్ సెక్రటరీలు నగరపు రమేష్, గంగిశెట్టి రాజకుమార్, గాదం కుమార్, మల్లంపల్లి మండల ఉపాధ్యక్షులు మచ్చిక రవి, బండి బాబు, కొండ యుగంధర్, జనరల్ సెక్రటరీ ఎండిగ రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు మామిడి రాజేందర్, గుంటుక సురేష్, రాగుల శ్రీకాంత్, గుండె కళ్యాణ్, బయ్య రాజేందర్ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అన్విత్ పటేల్కు గోల్డ్ మెడల్



**హైదరాబాద్, ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** జపాన్ కరాటే షోటోఖాన్ అకాడమి ఆధ్వర్యంలో బెంగళూర్ లో నిర్వహించిన 15వ జాతీయ స్థాయి షోటోఖాన్ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో బర్కత్ పుర లోని శ్రీ చైతన్య స్కూల్ 9వ తరగతి విద్యార్థి లక్కాకుల అన్విత్ పటేల్ పాల్గొని కుమితి విభాగంలో మొదటి బహుమతి (గోల్డ్ మెడల్), కటా విభాగంలో రెండవ బహుమతి (సిల్వర్ మెడల్) సాధించారు. అన్విత్ పటేల్ కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమిలో మాస్టర్ డాక్టర్ జిఎస్ గోపాల్ రెడ్డి వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నారు. జాతీయ స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన అన్విత్ పటేల్ ను శుక్రవారం శ్రీచైతన్య స్కూల్ బర్కత్ పుర ప్రిన్సిపాల్ ఆకుల మాధవి దేవి అభినందించి సన్మానించారు. తమ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం తమ స్కూల్ కే గర్వకారణంగా ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ గాయాత్రి, సి బ్యాచ్ ఇంచార్జీ వెంకటేష్, టీచర్స్ పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సమీక్ష



**కల్లూరు, ఆగష్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్)** :తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ అధ్యక్షతన రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ స్లాట్లు, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు, సదాబైనామా దరఖాస్తులు, ప్రజా ఫిర్యాదులు, ఏటిఆర్ లు, మీ సేవా ధ్రువపత్రాల దరఖాస్తులు తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రతి అంశంలో పెండింగ్‌ను తగ్గించి, నిర్ణీత గడువులో దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు వేగవంతంగా, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని, ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, తీసుకున్న చర్యల నివేదికలను సకాలంలో సమర్పించాలని సూచించారు. అలాగే భూభారతి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా, రిజిస్ట్రేషన్, మీ సేవా దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎటువంటి పెండింగ్ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రజల రెవెన్యూ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి, తాసిల్దార్ బ్రహ్మేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసన్నకుమార్, జిపిఓ లు పాల్గొన్నారు.

# ఉచిత పోలీస్ కోచింగ్‌కు భారీ స్పందన

**ఆగస్టు 20 నుంచి శిక్షణ.. స్టడీ మెటీరియల్ సైతం ఉచితం**

**టిఆర్ఎస్ లీడర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, బిర్లా విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు**




**హనుమకొండ, ఆగస్టు 14(పి సి డబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌ను పురస్కరించుకుని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు తెలంగాణ రక్షణ సేన చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే వంద మందికి పైగా అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, బిర్లా విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు తెలిపారు. శనివారం హనుమకొండలోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ ఉచిత కోచింగ్‌కు సంబంధించిన దరఖాస్తు ఫారాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు, పాత్‌ఫైండర్ ఎంట్రెన్స్ కాలేజ్ సహకారంతో హనుమకొండ కొత్త బస్టాండ్ సమీపంలోని కళాశాల ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సబ్జెక్టు నిపుణులతో నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఉద్యోగార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం ప్రత్యేక బ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సమీపంలోని ప్రైవేట్ హాస్టళ్లలో వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోచింగ్‌తో పాటు పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన నిరుద్యోగ యువత, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వెంకటేశ్వర్ రావు పిలుపునిచ్చారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి స్థిరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలనే లక్ష్యంతోనే తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తారని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలక ప్రవీణ్, నాయకురాలు జ్యోతి రెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా వేముల బాలస్వామి

**బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేత**

**తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్‌కు బాలస్వామి కృతజ్ఞతలు**



**ఉప్పల్,ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గానికి కీలక బాధ్యతలు అప్పగించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వేముల బాలస్వామిని పార్టీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. శుక్రవారం బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ చీఫ్ కోఆర్డినేటర్ గౌరవ అతహర్ సింగ్ చేతుల మీదుగా వేముల బాలస్వామి నియామక పత్రాన్ని అందుకున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, బహుజన వర్గాలను పార్టీతో అనుసంధానం చేయడం వంటి అంశాలపై నాయకత్వం దృష్టి సారించింది.

**బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తా**

నూతన బాధ్యతలు స్వీకరించిన వేముల బాలస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి, సహచర పదాధికారులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరు పేరునా జై భీమ్‌లు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని బాలస్వామి అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో బీఎస్పీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, పదాధికారులు, కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. బహుజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల సాధన కోసం బీఎస్పీ సిద్ధాంతాలకు అనుగుణంగా నిరంతరం కృషి చేస్తానని వేముల బాలస్వామి స్పష్టం చేశారు.

# సరస్వతి నగర్‌లో రూ.27.90 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన..



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 2వ డివిజన్ పరిధిలోని సరస్వతి నగర్‌లో రూ.27.90 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు నాణ్యతతో కూడిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికలు




**కరీంనగర్,ఆగస్టు 14(పీసీడబ్ల్యూ న్యూస్):** రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చరిత్రలో తొలిసారిగా ఈవీఎం యంత్రం ద్వారా ఎన్నికలు నిర్వహించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికలను నిర్వహించారు. హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ గర్ల్, హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ బాయ్ పదవులకు విద్యార్థులు పోటీ చేయగా, పాఠశాలలోని విద్యార్థులు తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్లు, ప్రచారం, ఓటింగ్ తదితర అంశాలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఈవీఎం ద్వారా ఓటింగ్ నిర్వహించడంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ నాయకులు, విద్యారంగ ప్రముఖులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ రెహమాన్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వం, బాధ్యత, క్రమశిక్షణ వంటి విలువలను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయిలోనే ప్రజాస్వామ్య విధానాలను పరిచయం చేయడం ద్వారా భవిష్యత్‌లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈవీఎం యంత్రం ద్వారా నిర్వహించిన విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# స్మార్ట్ రేషన్ కార్డుల జారీతో ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత పటిష్టం: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి







**కరీంనగర్ జిల్లా ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** స్మార్ట్ రేషన్ కార్డుల జారీతో ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత పటిష్టవంతమవుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలండలంలోని మన్నెంపల్లి, మక్తపల్లి, రామహనుమాన్ నగర్ గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన చౌకధరల రేషన్ దుకాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంద్రాగస్టు రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో కార్డులు అందజేయడం ద్వారా స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సాంకేతికను జోడిస్తూ తీసుకు వచ్చిన డిజిటల్ సేవల వల్ల రేషన్ దారులకు మరింత మేలు చేకూరుతుందని, సరకుల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగుతుందన్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆహార భద్రతకు ఇక స్మార్ట్ రేషన్ కార్డులే ఆధారమని ఆయన పేర్కొన్నారు. పేదలకు అందించే బియ్యం వారి కుటుంబాలకు నిజంగా ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానంలో మార్పులు తీసుకొచ్చిందన్నారు. రేషన్ కార్డులు కలిగిన అర్హులైన లబ్ధిదారులందరికీ చౌక ధరలకు నిత్యావసర సరుకులు అందించడమే ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని ప్రజలు వినియోగించేందుకు ఆసక్తి చూపకపోవడంతో వ్యాపారులకు విక్రయించిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దొడ్డు బియ్యానికి బదులుగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డీలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, ప్యాక్స్ చైర్మన్ గోపు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంపత్ రెడ్డి, పార్టీ నాయకులు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మామిడి అనిల్ కుమార్, గంకిడి లక్ష్మారెడ్డి, అసోద శ్రీనివాస్, బుధారపు శ్రీనివాస్, కొండల్ రావు, చింతల లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, పొట్ట శ్రీనివాస్,తాళ్లపల్లి కిరణ్, పెంట నోద్ కుమార్, రెడ్డిగాని రాజు, తమ్మనవేణి రాములు యాదవ్, పోతుగంటి శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం..




**కరీంనగర్ టౌన్ ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కిమ్స్ కాలేజీలో పోలీస్ ఈగల్ టీం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ తరఫున పాల్గొని నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు నిర్వహి స్తున్న వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఈగల్ టీం డీఎస్పీ ఉపేందర్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, కిమ్స్ కాలేజ్ వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, మిషన్ వాత్సల్య సిబ్బంది సాదినేని రమేష్, స్వప్న, త్రీ టౌన్ సీఐ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్టర్ బెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

## తాగునీటి నాణ్యతలో రాజీ వద్దు లోపాలను తక్షణమే సరిచేయాలి

## ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే నగరపాలక సంస్థ లక్ష్యం





**కరీంనగర్ ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగర ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతపై ఇటీవల వెలువడిన వార్తలు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్సిపల్ అధికారులతో కలిసి నగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్న ఫిల్టర్ బెడ్‌ను ఆకస్మికంగా సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫిల్టర్ బెడ్‌లో జరుగుతున్న నీటి శుద్ధీకరణ ప్రక్రియ, ఫిల్టరేషన్ వ్యవస్థ, క్లోరినేషన్, నిల్వ ట్యాంకులు, శుద్ధి చేసిన నీటి నాణ్యతతో పాటు నగరానికి నీటి సరఫరా జరుగుతున్న విధానాన్ని మేయర్ స్వయంగా పరిశీలించారు. ఇటీవల నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రంగుమారిన, మడ్డితో కూడిన నీరు సరఫరా అవుతోందన్న ఫిర్యాదులను మేయర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, “ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన తాగునీటి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఫిల్టర్ బెడ్ నుంచి బయటకు వెళ్లే ప్రతి లీటర్ నీరు పూర్తిగా శుద్ధి చేయబడి, నిర్ణీత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి” అని అధికారులను ఆదేశించారు. నీటి శుద్ధీకరణలో ఉపయోగించే ఆలం, క్లోరిన్ తదితర రసాయనాలను అవసరమైన మోతాదులో వినియోగించాలని, ఫిల్టర్లను నిర్ణీత వ్యవధిలో శుభ్రపరచాలని సూచించారు. ఫిల్టర్ బెడ్‌లో ఏవైనా సాంకేతిక లోపాలు లేదా నిర్వహణ సమస్యలు ఉంటే వాటిని యుద్ధ ప్రాతిపదికన గుర్తించి తక్షణమే సరిచేయాలని ఇంజినీరింగ్, వాటర్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తాగునీటి నమూనాలను సేకరించి క్రమం తప్పకుండా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన చోట పైప్‌లైన్ లీకేజీలు, కలుషిత నీరు కలిసే అవకాశాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. వర్షాకాలంలో నీటి కలుషితానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందు వల్ల అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మేయర్ సూచించారు. ఫిల్టర్ బెడ్ నుంచి ప్రజల ఇంటి వరకు నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడం కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రథమ బాధ్యత అని, ఇకపై తాగునీటి నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. తాగునీటి సరఫరాపై ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ప్రజలు వెంటనే నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకురావాలని మేయర్ కోరారు. మేయర్ వెంట కార్పొరేటర్లు మాసం గణేష్, ఏపీపీ చంద్ర, గాజా రమ శివరాం, భారీ అపర్ణ జితేందర్, ఎస్ఈ సంపత్ రావు, డీఈ దేవేందర్ రెడ్డి, ఏఈ రఘువర్ధన్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులు అరెస్ట్: ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి



**సత్తుపల్లి, ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గంజాయిని అక్రమంగా కారులో తరలిస్తున్న ఇద్దరు నిందితులను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంఒడిశా నుంచి హైదరాబాద్ కు గంజాయి కారులో అక్రమ రవాణా జరుగుతుందనే విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఈగల్ టీమ్, సత్తుపల్లి పోలీస్ సిబ్బంది సత్తుపల్లిలో సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీలో కారులో అనుమానస్పదంగా కనిపించిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోని విచారించాగా కోరాపుట్, ఒడిశా రాష్ట్రం కు చెందిన కామేష్ మారి, కారా రాజేంద్ర గా గుర్తించి వారి నుండి సుమారు మూడు లక్షల కు పైగా విలువ చేసే 6 కేజీల 360 గ్రాముల గంజాయి ని, 2 మొబైల్ ఫోన్లు,ఒక కారు ను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితులపై ఎన్డీపిఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గంజాయి నిరోధక చట్టం లో భాగంగా ఎవరైనా వ్యక్తులు గంజాయిని కొన్న కానీ పీల్చినా కానీ వారిపై పీడి యాక్ట్ కేసు నమోదు చేయబడతాయని తెలిపారు. మీకు తెలిసిన సమాచారాన్ని పోలీస్ వారికి అందజేస్తే తగిన రివార్డు ఇవ్వబడుతుందని వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్, ఈగల్ టీం సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నాణ్యమైన సేవలందించే లక్ష్యంతో “శ్రీ సమీక్షా మానసిక వికలాంగుల పాఠశాల“ ప్రారంభం

## రాప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్







**కరీంనగర్ టౌన్ ఆగస్టు 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మెరుగైన విద్య, శిక్షణ, పునరావాస సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ‘శ్రీ సమీక్షా మానసిక వికలాంగుల పాఠశాల’ను నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాల ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, థెరపీ విభాగాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవించేలా తీర్చిదిద్దడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ పాఠశాల ద్వారా ప్రత్యేక విద్యతో పాటు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, దైనందిన జీవన నైపుణ్యాల శిక్షణ వంటి సమగ్ర సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రత్యేక పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల అభివృద్ధి కోసం అందుబాటులో ఉన్న విద్యా, వైద్య, పునరావాస సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల నిర్వాహకులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం సమాజానికి ఆదర్శప్రాయమని, భవిష్యత్తులో పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామ్ ప్రత్యేక పిల్లల ఆరోగ్యం, వైద్యపరమైన అవసరాలు, నిరంతర చికిత్స, థెరపీ ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, తోట అనిల్, ఆకుల నందిని ఉదయ్, సాదవేని సుజాత శ్రీనివాస్, చొప్పరి జయశ్రీ, పాఠశాల ప్రతినిధి జ్యోతి, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పొంగిన దేశభక్తి... వందేమాతరం... భారత్ మాతాకీ జై...!

### కరీంనగర్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' భారీ తిరంగా ర్యాలీ

### ొతెలంగాణ చౌక్ నుండి రామ్‌నగర్ వరకు దేశభక్తి నినాదాలతో కోలాహలంగా సాగిన ర్యాలీ పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, విద్యార్థులు






**ొకరీంనగర్ టౌన్ ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లి'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ నగరంలో భారీ తిరంగా ర్యాలీని జిల్లా అధ్యక్షుడు లిసాయిని మల్లేశం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ రామ్‌నగర్ వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. వేలాది మంది కళాశాల విద్యార్థులు, యువకులు, మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని దేశభక్తిని చాటుతూ ర్యాలీలో పాల్గొన్నారు.ర్యాలీ మొత్తం 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం', 'జై హింద్' నినాదాలతో మార్మోగిపోయింది. త్రివర్ణ పతాకాల రెపరెపలతో కరీంనగర్ వీధులు దేశభక్తి ఉత్సాహంతో నిండిపోయాయి. యువతలో జాతీయ భావాలను, దేశంపై మమకారాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మరియు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడిలో జాతీయ భావాలను ఇనుమడింపజేసే గొప్ప ఉద్యమమని అన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను, స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి భారతీయుడు జాతీయ జెండా నీడన ఒక్కటవ్వాలని, జాతీయ జెండా గౌరవాన్ని కాపాడుతూ దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కోరారు.ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు ర్యాలీలో పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేసిన కళాశాల విద్యార్థులు, యువత, పార్టీ శ్రేణులకు వారు ప్రత్యేకం గా ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతి నిధులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల, జోన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు వివిధ కళాశాల లకు చెందిన విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ల ఐక్యతే శక్తి

- ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక!
- టెక్నీషియన్ల సంక్షేమానికి శ్రమిస్తాం
- నూతన అధ్యక్ష, కార్యదర్శులు దార్ల మల్లిబాబు, ఎస్.కే. ఖాసిం భరోసా



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ల సంక్షేమం, హక్కుల సాధనే ధ్యేయంగా "ఖమ్మం ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ యూనియన్" నూతన కార్యవర్గం శుక్రవారం ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో ఎన్నికైంది. టెక్నీషియన్లందరి ఐకమత్యం చాటుతూ నూతన కమిటీ అధ్యక్షుడిగా దార్ల మల్లిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కే. ఖాసిం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వి.7 న్యూస్ ఛానల్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ.సి. మెంబర్ గింజపల్లి శ్రీనివాస్ నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం, నూతన కార్యవర్గ సభ్యులు ఖమ్మం వన్ టౌన్ సి.ఐ టి. కరుణాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి, ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

**నూతన కార్యవర్గ సభ్యులు** అధ్యక్షు లుగా దార్ల మల్లిబాబు ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె ఖాసిం ఉపాధ్యక్షులుగా నరసింహారావు, జాయింట్ సెక్రెటరీగా మహమ్మద్ అలీ, కోశాధికారి పెండ్యాల నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా పిన్నోజు రమేష్, మీర్జా ఇక్బాల్, గౌరవ సలహాదారులుగా నీలకంటేశ్వరరావు, కోటేశ్వరావు లను ఎన్నుకున్నారు.నూతన అధ్యక్ష, కార్యదర్శులు దార్ల మల్లిబాబు, ఎస్.కే. ఖాసిం మాట్లాడుతూ... యూనియన్ సభ్యులందరి సహకారంతో, ఐక్యమత్యంతో ముందుకెళ్తామని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో కష్టపడి పనిచేస్తున్న టెక్నీషియన్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సంక్షేమ పథకాలు, లబ్ధి అందేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సాంకేతిక రంగానికి చెందిన కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి తగిన గుర్తింపు, భద్రత కల్పించేం దుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వర్కింగ్ కమిటీ సభ్యులకు, టెక్నీషియన్లకు భరోసానిచ్చారు.

# ఉప్పొంగిన దేశభక్తి... వందేమాతరం... భారత్ మాతాకీ జై....!!

### కరీంనగర్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ..

### తెలంగాణ చౌక్ నుండి రామ్‌నగర్ వరకు సాగిన ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, విద్యార్థులు..





**కరీంనగర్ టౌన్ ఆగస్టు 14 (పిసి డబ్ల్యూ న్యూస్):** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కరీంనగర్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం రోజున భారీ తిరంగా ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని ప్ తెలంగాణ చౌక్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ రామ్‌నగర్ వరకు కోలాహలంగా సాగింది.ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు, యువకులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని, దేశభక్తిని చాటేలా 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' అంటూ చేసిన నినాదాలతో కరీంనగర్ వీధులు మార్మోగాయి. యువతలో జాతీయ భావాలను, దేశంపై మమకారాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం అద్భుతంగా కొనసాగింది. ఈ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రాముఖ్యత ను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. 'హర్ ఘర్ తిరంగా' అనేది దేశవ్యాప్తంగా పౌరుల్లో జాతీయ భావాలను ఇనుమడింపజేయడానికి చేపట్టిన ఒక గొప్ప ఉద్యమం లాంటిదని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాతీయ స్ఫూర్తి కలిగి ఉండాలని, దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా స్మరించుకోవాలన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి భారతీయుడు జాతీయ జెండా నీడన ఒక్కటవ్వడం, దేశ గౌరవాన్ని పెంచుతూ, జాతీయ జెండా ప్రాముఖ్యతను, గౌరవాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూ ముందుకు కొనసాగాలని పిలుపునిచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ తిరంగా ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొనీ , ప్రోగ్రాంను విజయవంతం చేసిన కళాశాల విద్యార్థులకు , యువకులకు , పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ప్రత్యేక ఈ ర్యాలీ ద్వారా కరీంనగర్ ప్రజలకు, ముఖ్యంగా యువతకు జాతీయ జెండా గొప్పతనాన్ని వివరించడమే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ ప్రోగ్రాం లో మాజీ శాసనసభ్యులు బుడిగే శోభ, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్ , బంగారు రాజేంద్రప్రసాద్, ఇ నుగొండ నాగేశ్వర్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి , సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, గుజ్జ శ్రీనివాసరావు, వాసాల రమేష్ , పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మలాదేవి, యువ మోర్చా అధ్యక్షులు సంఘ నరేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతె గంగారెడ్డి , ఓబిసి మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్, మైనారిటీ మోర్చా అధ్యక్షులు పర్వేజ్, ముజీబ్ , ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ , ఎస్టీ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ , మీడియా కన్వీనర్ కటకంలోకేష్ లతోపాటు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు , వివిధ మండలాల, జోన్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలతో పాటు వివిధ కళాశాలలో చెందిన విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.,

# హైదరాబాద్‌లో పూలే దంపతుల విగ్రహావిష్కరణ

- పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

**షాద్ నగర్, ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**

సామాజిక సంస్కర్తలు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా ఆవిష్కరించారు. నెక్లెస్ రోడ్‌లోని ఐమ్యాక్స్ సర్కిల్ ఎదురుగా హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ఆర్. కృష్ణయ్య, సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మందుల సామేల్, మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.నాయకులు పూలే దంపతుల సేవలను స్మరించుకున్నారు. మహిళా విద్య, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను సమాజంలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం సమీపంలో పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయడం సామాజిక సంస్కరణల చరిత్రకు గుర్తుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.



# మూడు రూట్లలో బస్ సర్వీసులు

### పచ్చ జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి





**కరీంనగర్ టౌన్ ఆగస్టు 14 (పిసి డబ్ల్యూ న్యూస్):** ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మూడు మార్గాల్లో ప్రవేశపెట్టిన నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం గన్నేరువరం మండలం గుండ్లపల్లి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కరీంనగర్ నుంచి గన్నేరువరం, బెజ్జంకి మీదుగా హైదరాబాద్, కరీంనగర్ నుంచి గన్నేరువరం, కరీంనగర్ నుంచి బెజ్జంకి, రేపాక మీదుగా ఇల్లంతకుంటకు నడిచే బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన పార్టీ నాయకులు, ఆర్టీసీ అధికారులతో కలిసి బస్సులో టిక్కెట్టు తీసుకొని కొంత దూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్త బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమైన విషయమన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, ఇతర ప్రయాణికులకు ఈ సర్వీసులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. గతంలో సరైన బస్సు సౌకర్యం లేక ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేదని, దీంతో అధిక ప్రయాణ ఖర్చులు భరించాల్సి వచ్చేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, అందుబాటు ధరలో ప్రయాణించే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మూడు మార్గాల్లో బస్సులు నడిపేందుకు సహకరించిన రాష్ట్ర రవాణాశాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ప్రారంభించిన బస్సు సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రయాణికుల ఆదరణను బట్టి భవిష్యత్తులో మరిన్ని సర్వీసులు, అదనపు ట్రిప్పులు అందుబాటులోకి తీసుకురావడానికి ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేస్తామని చెప్పారు. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం కూడా అభివృద్ధిలో ఒక ముఖ్యమైన భాగమని, మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, ఆర్టీసీ కరీంనగర్ -1 డిపో మేనేజర్ ఐ.విజయ మాధురి, అధికారులు పడాల రవీందర్, లక్ష్మయ్య, సంపత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునిల్, ముస్కు ఉపేందర్ రెడ్డి, మాతంగి అనిల్, జె.మన్మోహన్ రావు, సిహెచ్ శ్రీధర్ రెడ్డి, బుర్ర తిరుపతిగౌడ్, న్యాత జీవన్, సురేందర్ రెడ్డి, సంతోష్, రాజేశ్వరి పాల్గొన్నారు.



# పొంగులేటి అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

**• కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన కల్లూరు కాంగ్రెస్ • మంత్రి పొంగులేటిపై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి • అభివృద్ధి కళ్లకు కనిపించడం లేదా..? కాంగ్రెస్ నేతల ఆగ్రహం**







**కల్లూరు, ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. కల్లూరులో మాజీ సర్పంచ్ లక్కినేని కృష్ణ నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొట్రూ అర్జున్‌రావు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన కౌశిక్‌రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ అధినాయకత్వాన్ని మెప్పించేందుకు మంత్రి పొంగులేటిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదన్నారు. **ఇందిరమ్మ ఇళ్లు.. ఇంద్రభవనాల్లా కనిపించడం లేదా?** ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ఇంద్రభవనాలను తలపించేలా ఇళ్లు నిర్మిస్తుంటే ఆ అభివృద్ధి కౌశిక్‌రెడ్డి కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు జరుగుతున్న అభివృద్ధిని చూసి మాట్లాడాలని హితవు పలికారు. **అనుచిత వ్యాఖ్యలు వెనుకకు తీసుకోవాలి** మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని అడ్డుకునేలా రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను పాడి కౌశిక్‌రెడ్డి వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజాక్షేత్రంలోనే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఒక ప్రజాప్రతినిధి మరో ప్రజాప్రతినిధిపై విమర్శలు చేసే సమయంలో హుందాతనాన్ని పాటించాలని సూచించారు. **విమర్శలతో తప్పు దోవ పట్టించలేరు** టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వ్యక్తిగత విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌కె ఉస్మాన్, యూత్ మండల అధ్యక్షుడు ఆలకుంట నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఖమ్మంపాటి రాధా వీరస్వామి, ఉబ్బన రాంబాబు, యాస నాగమణి శ్రీకాంత్, కిష్టంశెట్టి ఏడుకొండలు, బైర్ల కాంతా రావు, కే వెంకటేశ్వరరావు (కె.వి.ఆర్), నోటి కృష్ణా రెడ్డి, బొప్పన శ్రీనాథ్, పుల్లయ్య, కుంచాల గురవయ్య, ధరావత్ రవికుమార్, అఫ్రోజ్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆటల్లో ఉత్సాహం.. గుండెల్లో దేశభక్తి

**- 80వ స్వాతంత్ర్య వేడుకల స్ఫూర్తితో మూడు రోజులుగా ముదిగొండ గురుకులంలో సాంస్కృతిక, క్రీడా సంబరాలు**

**- విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని నింపుతున్న ముదిగొండ గురుకుల పాఠశాల**

**- ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాములు**







**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మైదానంలో పరుగులు తీస్తున్న ప్రతి అడుగు.. విజయాన్ని అందుకోవాలనే ప్రతి ప్రయత్నం.. స్నేహితుల విజయానికి మార్మోగిన ప్రతి కేరింత.. భారతమాతను స్మరించిన ప్రతి నినాదం.. ఇవన్నీ కలిసి ముదిగొండ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో స్వాతంత్ర్య వేడుకలకు సరికొత్త శోభను తీసుకొచ్చాయి. దేశం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ.. ఆటల్లో ప్రతిభను చాటుకుంటూ.. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గత మూడు రోజులుగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం, ముదిగొండ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాములు మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య పోరాటం కేవలం చరిత్ర పుస్తకాల్లోని అధ్యాయం కాదని, ప్రతి భారతీయుడి గుండెల్లో నిలిచే స్ఫూర్తి అని అన్నారు. స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలు, ఎదుర్కొన్న కష్టాలు, చూపిన ధైర్యసాహసాలను నేటితరం విద్యార్థులకు తెలియజేసి, వారిలో దేశభక్తి భావాలను బలంగా నాటాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చదువుతో పాటు ఆటలు.. ఆటలతో పాటు విలువలు విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఓటమిని స్వీకరించే మనోధైర్యాన్ని, విజయాన్ని వినయంగా ఆస్వాదించే సంస్కారాన్ని నేర్పుతాయని తెలిపారు. విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం కలిసినప్పుడే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయని అన్నారు. **80 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతిబింబిస్తూ ఆర్ట్ టీచర్ హోరి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు 80 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను అద్భుతంగా చిత్రించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ కుంచెతో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఆవిష్కరించిన విద్యార్థుల కళా ప్రతిభను ప్రిన్సిపల్ డాక్టర్ రాములు అభినందించారు. చిత్రాల ద్వారా చరిత్రను తెలుసుకోవడంతో పాటు, స్వేచ్ఛ వెనుక దాగిన త్యాగాలను విద్యార్థులు అనుభూతి చెందడం అభినందనీయమన్నారు. **ఆటల మైదానంలో ఉరకలెత్తిన ఉత్సాహం** కృష్ణాపురంలోని ముదిగొండ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో గత మూడు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. గురుకుల ఆవరణ క్రీడాకారుల కేరింతలు, స్నేహపూర్వక పోటీలు, విజయోత్సాహాలతో సందడిగా మారింది. ఓటమిలో నిరాశ చెందకుండా.. విజయాన్ని లక్ష్యంగా చేసుకుని.. సహచరులను ప్రోత్సహిస్తూ విద్యార్థులు పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ సతీష్, వ్యాయామ ఉపాధ్యాయుడు మౌలాలి ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని భవిష్యత్ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. **సాహిత్యం.. సంస్కృతి.. క్రీడలతో స్వాతంత్ర్య స్ఫూర్తి** సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వ్యాసరచన, డిబేట్, క్విజ్ తదితర సాహిత్య పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, వారి త్యాగగాథలను విద్యార్థులకు వివరించడం ద్వారా దేశం పట్ల ప్రేమను, బాధ్యతను పెంచే ప్రయత్నం చేశారు. స్వేచ్ఛ అంటే బాధ్యత.. సమానత్వం అంటే గౌరవం.. దేశభక్తి అంటే దేశం కోసం మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించడం అనే భావనలను విద్యార్థుల్లో బలంగా నాటాలని ఉపాధ్యాయులు సూచించారు. పలు పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. విజేతలకు శనివారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, సీనియర్ అధ్యాపకులు కొక్కిరేణి సత్యం, లింగాల నరేష్, ఉపాధ్యాయులు రావిరాల బుచ్చయ్య, సామ్సన్, కృష్ణమూర్తి, బాలకృష్ణ, నాగేశ్వరరావు, రేణుక, సుధాకర్, అనిల్, మహేష్ తదితరులు వివిధ కమిటీల నిర్వాహకులుగా పాల్గొన్నారు. క్రీడా కార్యక్రమాల్లో నాగేంద్రం, రాధిక, సంజీవ్ రావు, బొక్క నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి మాటల్లో మాత్రమే కాదు.. మన చేతల్లో కనిపించాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకాలు కావాలి. ఆటల మైదానంలో గెలిచే ప్రతి విద్యార్థి జీవితంలోనూ విజేతగా నిలవాలి. ఈ స్ఫూర్తితో ముదిగొండ గురుకులంలో సాగిన స్వాతంత్ర్య సంబరాలు విద్యార్థుల మనసుల్లో చిరస్మరణీయ జ్ఞాపకంగా నిలిచాయి.

# నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, ఆధునిక సాంకేతికతతో వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలి

**వ్యవసాయ విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై ప్రాక్టికల్ అవగాహన కల్పించాలి**

**పరిశోధన ఫలితాలను రైతులకు చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలి**

**మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పాలిటెక్నిక్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం సేవలు రైతులకు మరింత చేరువ చేసి నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టి పంటల్లో అధిక దిగుబడులే లక్ష్యంగా పరిశోధనలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మధిర పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ పరిశోధన కేంద్రం వ్యవసాయ పాలిటెక్నిక్ ను జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పరిశోధన కేంద్రంలో కొనసాగుతున్న పరిశోధనలు, ఎల్నినో ప్రభావంకు అనుకూలమైన విత్తనాల సరఫరా, విత్తనోత్పత్తి, పంటల సాగు, మౌళిక వసతులు, సిబ్బంది వివరాలు, వ్యవసాయ పాలిటెక్నిక్‌లో అందిస్తున్న కోర్సులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం అధికారులు కలెక్టర్‌కు కేంద్రం ఏర్పాటు, ప్రధాన లక్ష్యాలు, ఇప్పటివరకు చేపట్టిన పరిశోధన కార్యకలాపాలు, వివిధ పంటలలో అభివృద్ధి చేసిన సాంకేతికతలు, విత్తనోత్పత్తి తదితర అంశాలను వివరించారు. మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రారంభం తర్వాత జొన్న, పప్పుధాన్యాలు, ప్రస్తుతం పెసర, మినుము పంటలపై ప్రధానంగా పరిశోధనలు, విత్తనోత్పత్తి కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు శాస్త్రవేత్తలు కలెక్టర్ కు వివరించారు. కేంద్రంలో పెసర, మినుము, కంది, జొన్న, వరి తదితర పంటల్లో పరిశోధనలు, నాణ్యమైన బ్రీడర్, ఫౌండేషన్ విత్తనాల ఉత్పత్తి చేపడుతున్నట్లు తెలిపారు. తర్వాత వ్యవసాయ క్షేత్రంలో 202627 సంవత్సరానికి వివిధ పంటలకు సంబంధించి అందుబాటులో ఉన్న విత్తన నిల్వలు, ఉత్పత్తి లక్ష్యాలను పరిశీలించి, కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, పెసర, మినుము పంటల్లో అధిక దిగుబడులు, తెగుళ్లు, పురుగులను తట్టుకునే రకాలను అభివృద్ధి చేయడం, వరి మాగాణి పరిస్థితుల్లో పప్పుధాన్యాల సాగుపై పరిశోధనలు చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం ద్వారా అభివృద్ధి చేసిన వీ++-385 (మధిర పెసర01), వీ++-389 (మధిర పెసర389), వీదీ+-1070 (మధిర మినుము01), వీదీ+-1080 (మధిర మినుము1080) వంటి రకాల వివరాలను, పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేస్తున్న కొత్త వంగడాలు, సాగు పద్ధతులు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే విధానాలు, పంటల ఉత్పాదకత పెంపునకు చేపడుతున్న ప్రయోగాలను రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిశోధన ఫలితాలు ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. నాణ్యమైన విత్తనోత్పత్తికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు అవసరమైన సమయంలో విత్తనాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. పప్పుధాన్యాల సాగు విస్తరణకు అనువైన సాంకేతికతలు, అధిక దిగుబడినిచ్చే రకాలు, పంటల మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మధిర వ్యవసాయ పాలిటెక్నిక్‌ను కలెక్టర్ సందర్శించారు. కళాశాలలో అందిస్తున్న అగ్రికల్చర్ డిప్లొమా కోర్సు, విద్యార్థుల ప్రవేశాలు, బోధనా సిబ్బంది, ప్రాక్టికల్ శిక్షణ, విద్యార్థులకు అందుతున్న ఇతర సౌకర్యాలను పరిశీలించారు. వ్యవసాయ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు పంటల సాగు, వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ, ఉద్యానవనం తదితర అంశాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. వ్యవసాయ విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు క్షేత్రస్థాయి అనుభవం కల్పించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ అన్నారు.

# శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దు

**• శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా**




శ్రీలంకలోని గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఆగస్టు 15 నుంచి భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు మ్యాచ్? ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు టెస్ట్ సిరీస్ ఆడేందుకు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీమిండియాను హెచ్చరించారు. ఆతిథ్య శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దని.. ఈ సిరీస్ టీమిండియాకు అంత సులభంగా ఉండబోదని స్పష్టం చేశారు. భారత్, శ్రీలంక జట్లు చివరిసారిగా 2022లో బెంగళూరులో డే-నైట్ టెస్టులో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా 238 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత ఈ రెండు జట్లు సుదీర్ఘ కాలం పాటు టెస్టుల్లో ఎదురు పడలేదు. ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పరంగా ఈ సిరీస్ అత్యంత కీలకమైనదని.. ప్రస్తుతం స్టాండింగ్స్ లో మెరుగైన స్థానంలో ఉన్న శ్రీలంక భారత్ కు గట్టి పోటీనిస్తుందని ధనంజయ డి సిల్వా ధీమా వ్యక్తం చేశారు. సాధారణంగా గాలే స్టేడియం పిచ్ స్పిన్నర్లకు విపరీతంగా సహకరిస్తుందనే పేరుంది. అయితే ఈ సారి పిచ్ పరిస్థితులు భిన్నంగా ఉంటాయని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా గ్రౌండ్ సిబ్బంది పూర్తి స్థాయిలో పిచ్ ను సిద్ధం చేయలేకపోయినప్పటికీ.. ఈ వికెట్ బ్యాటర్లకు బాగా సహకరిస్తుందని ఆయన వెల్లడించారు. ఇరు జట్ల బ్యాటర్లకు మంచి పరుగులు సాధించే అవకాశం ఉంటుందని డి సిల్వా అభిప్రాయపడ్డారు. గాయపడిన కుశాల్ మెండిస్ స్థానంలో సీనియర్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లాను జట్టులోకి తీసుకోవడంపై డి సిల్వా వివరణ ఇచ్చారు. 'గాలే స్టేడియంలో వికెట్ కీపింగ్ చేయడం చాలా సవాలుతో కూడుకున్నది. అందుకే టాలెంటెడ్ వికెట్ కీపర్ అవసరం ఏర్పడింది" అని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. అలాగే ఈ మ్యాచ్ ద్వారా యువ ఆఫ్ స్పిన్నర్ కేశర నువంత టెస్టుల్లోకి అరంగేట్రం చేసే అవకాశం ఉందని తెలిపారు.

# తొలి టెస్ట్‌కు భారీ అడ్డంకి!



భారత టెస్ట్ టీమ్ చారిత్రాత్మక మ్యాచ్‌కు సిద్ధమైంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం గాలే వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. ఇది టెస్ట్‌ల్లో టీమిండియాకు 600వ మ్యాచ్ కావడం విశేషం. స్వాతంత్ర్యదినోత్సవం నాడే ఈ మ్యాచ్ ప్రారంభమవుతుండటం మరింత ప్రత్యేకత సంతరించుకుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకం. డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ దక్కాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా క్లీన్ స్వీప్ చేయాలి. దాంతోనే విజయమే లక్ష్యంగా శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా బరిలోకి దిగుతోంది. శ్రీలంక కండిషన్స్‌కు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే అక్కడికి వెళ్లి సన్నద్దమైంది. వామప్ మ్యాచ్ కూడా ఆడి గెలిచింది. అయితే తొలి టెస్ట్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే వర్షం కారణంగా గాలే వేదికగా టీమిండియా సన్నాహకాలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం కూడా టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌కు వర్షం అడ్డంకిగా మారింది. తొలి టెస్ట్ జరిగే ఐదు రోజుల పాటు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం గాలేలో వాతావరణం మేఘావృతమై, చల్లని గాలులు వీచడంతో పాటు చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. కాబట్టి మ్యాచ్ కాస్త ఆలస్యంగా ప్రారంభం కావచ్చు. ఉష్ణోగ్రతలు 30-31డిజ మధ్య ఉండే అవకాశం ఉండగా.. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతతో ఆటగాళ్లు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అక్యూవెదర్ రిపోర్ట్ ప్రకారం.. శనివారం ఉదయం 90 శాతం వర్షం పడే అవకాశం ఉంది. 5.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. గంటకు సుమారు 20-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. రెండో రోజైన ఆదివారంతో పాటు తర్వాతి సోమవారం, మంగళవారం, బుధవారాల్లో కూడా వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. దాంతో మ్యాచ్‌కు పదే పదే అంతరాయం ఏర్పడవచ్చు. 2017లో చివరిసారిగా శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమిండియా.. కోహ్లి సారథ్యంలో 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. గాలేలో చివరిసారిగా జరిగిన టెస్ట్‌లో టీమిండియా 304 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.

# తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారింది

**టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్**




స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా టీమిండియా ఆడే 600వ టెస్ట్ మ్యాచ్‌కు నాయకత్వం వహించడం చాలా గర్వంగా ఉందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)2027 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోవడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని చెప్పాడు. తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారిందన్నాడు. డబ్ల్యూటీసీ 2027 సైకిల్‌లో భాగంగా శ్రీలంక పర్యటనలో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్దమైంది. రేపు( శనివారం) గాలే అంతర్జాతీయ మైదానంలో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇది భారత్‌కు 600వ టెస్ట్ మ్యాచ్. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నాడే ఈ మ్యాచ్ జరుగుతుండటం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సిరీస్‌కు టీమిండియా అన్ని విధాల సిద్దమైంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శుభ్‌మన్ గిల్ పాల్గొన్నాడు. సిరీస్ గెలిచి డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ రేసులో నిలవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. 'కెప్టెన్సీ బాధ్యతల్లో నేను చాలా సౌకర్యంగా ఉన్నా. శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కాలంటే.. కనీసం మేం ఏడు టెస్ట్‌ల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి ఫ్రెష్‌గా మెదలుపెడుతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం నాడే భారత్ 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి చారిత్రాత్మక పోరుకు సారథ్యం వహించడం నాకు దక్కిన గొప్ప గౌరవం. మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఆటగాళ్లకు కాస్త సమయం ఇవ్వాలి. కొందరికీ కాస్త ఎక్కువ సమయం పడుతుంది.

అయినా సరే వారికి అండగా ఉంటాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ మెరుగ్గా రాణించాడు. కానీ అతను గాయం కారణంగా తప్పుకోవాల్సి వచ్చింది. బీసీసీఐ సీఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్ మధ్య ఎలాంటి గ్యాప్ లేదు. మేం కోరుకున్నంత వేగంగా సాయి సుదర్శన్ కోలుకోలేకపోయాడు. అయితే మా జట్టులోని 15 మంది ఆటగాళ్లపై మాకు నమ్మకం ఉంది. తుది జట్టును ఇంకా ఖరారు చేయలేదు. పేసర్ల ఎంపిక తలనొప్పిగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. బౌన్స్‌ను కూడా రాబడతాడు. అయితే ప్రసిధ్ కృష్ణ వామప్ మ్యాచ్‌లో కూడా సత్తా చాటాడు. సిరాజ్‌తో పాటు రెండో పేసర్ ఎవరా? అనేది తేల్చుకోలేకపోతున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తుది జట్టును ఎంపిక చేస్తాం.'అని శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు.



# సర్ఫరాజ్ స్పిన్‌ను సమర్థవంతంగా ఆడగలడు

**• టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్**

శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతలపై మేనేజ్‌మెంట్ స్పష్టతనిస్తే ఉప ఖండపు రారాజుగా ఎదుగుతాడని తెలిపాడు. సర్ఫరాజ్ ఖాన్ స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడగలడని అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్దమైంది. శనివారం(ఆగస్ట్ 15) నుంచి గాలే ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా తొలి టెస్ట్ మొదలవ్వనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్‌పై ఆశలు సజీవంగా ఉండాలంటే.. ఈ సిరీస్ గెలవడం టీమిండియాకు కీలకం. అయితే భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో జట్టుకు దూరమయ్యారు. సాయి సుదర్శన్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన అశ్విన్.. సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతల గురించి క్లారిటీ ఇవ్వాలని మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. 'సాయి సుదర్శన్ గాయంతో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. సర్ఫరాజ్‌కు జట్టులో తన పాత్రపై క్లారిటీ ఇవ్వాలి. కొన్ని కండిషన్స్‌లో అతని సామర్థ్యంపై సందేహం ఉంటే ఆ విషయాన్ని అతనికి చెప్పాలి. ఉపఖండం కండిషన్స్‌లోనే నువ్వు రాణించగలవు, అప్పుడే నీకు అవకాశం ఇస్తామని చెప్పాలి. అప్పుడు సర్ఫరాజ్ ఖాన్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోడు. మంచి స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలో మరింత ఫోకస్ పెడుతాడు. ఉంపఖండపు పరిస్థితుల్లో రారాజుగా మారుతాడు. తన కెరీర్‌ను నిర్మించుకుంటాడు. స్పిన్ కాకుండా ఇతర కండీషన్స్‌లో అతను రాణించలేడని భావిస్తే.. ఆ విషయాన్ని అతనికి చెప్పాలి.'అని అశ్విన్ సూచించాడు. అయితే తుది జట్టులో సర్ఫరాజ్ ఖాన్‌కు బదులు ముందుగా ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. గాలె స్టేడియం స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ క్రమంలోనే ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. సర్ఫరాజ్ ఖాన్ స్పిన్‌ను సమర్థవంతంగా ఆడగలడని పేర్కొంటున్నారు. మరోవైపు ధ్రువ్ జురెల్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలోనే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం దక్కుతుందా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

# జెమిమా రోడ్రిగ్స్‌కు గాయం..




ఇండియన్ ఉమెన్స్ క్రికెట్ టీమ్ స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ ఇంజ్యూరీ కారణంగా రాబోయే రెండు బిగ్ టోర్నమెంట్లకు దూరమైంది. ఇంగ్లాండ్ లో జరిగిన 'ద హండ్రెడ్' లీగ్ లో ఆడుతున్న సమయంలో హామ్‌స్ట్రింగ్ గాయం వల్ల ఆమె రాబోయే ఉమెన్స్ ఆసియా కప్ తో పాటు ఏషియన్ గేమ్స్ నుంచి కంప్లీట్ గా రూల్ అవుట్ అయింది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (సీఓఈ) మెడికల్ టీమ్ ఆమెను పరిశీలించి, గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో రెస్ట్ అవసరమని తెలిపినట్లు బిసిసిఐ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. "ఆగస్టు 3న ఇంగ్లాండ్ లో 'ద హండ్రెడ్' మ్యాచ్ ఆడుతుండగా జెమిమా కుడి తొడ కండరాల గాయానికి గురైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో బిసిసిఐ మెడికల్ టీమ్ ఆమెకు క్లినికల్ టెస్టులు నిర్వహించింది. ఈ టెస్టుల్లో ఆమెకు హై-గ్రేడ్ టియర్ ఉన్నట్లు తేలింది" అని బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. దాంతో యూఏఈ వేదికగా జరగబోయే ఆసియా కప్, జపాన్ లో జరగబోయే ఏషియన్ గేమ్స్ కు జెమిమా దూరమవ్వక తప్పలేదు. 25 ఏళ్ల జెమిమా స్థానంలో ప్రతీక రావల్ ను ఉమెన్స్ సెలెక్షన్ కమిటీ రీప్లేస్‌మెంట్ గా ఎంపిక చేసింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ వేదికగా ఏసీసీ ఉమెన్స్ ఆసియా కప్ జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ లోని ఐచి-నగోయా వేదికగా ఏషియన్ గేమ్స్ జరగనున్నాయి. కీలకమైన ఈ రెండు టోర్నీలకు ముందు స్టార్ బ్యాటర్ దూరం కావడం భారత జట్టుకు బిగ్ షాక్ అనే చెప్పాలి. జెమిమా రోడ్రిగ్స్ స్థానంలో ప్రతీక రావల్ ఎంట్రీతో బిసిసిఐ అప్‌డేటెడ్ స్క్వాడ్ ను రిలీజ్ చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్ గా టీమ్ ను లీడ్ చేయనున్నారు. జట్టులో షెఫాలీ వర్మ, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్, ప్రతీక రావల్ ఉన్నారు.



# బ్లాక్‌హాక్స్ జట్టులో నలుగురు తెలుగోళ్లు

## - గోవా గార్డియన్స్ ట్రోఫీలో శుభారంభం

**గోవా:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ఫ్రాంచైజీ హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఇటీవల విజయవాడలో నిర్వహించిన అండర్-21 ట్రయల్స్‌లో ప్రతిభావంతులైన తెలుగు నలుగురు తెలుగు క్రీడాకారులకు జట్టులోకి తీసుకుంది. కార్తిక్ ( గుంటూరు), ధీమన్ ( వైజాగ్), స్రునిక్ (పెద్దపల్లి), అక్షిత్ ( వరంగల్ ) బ్లాక్‌హాక్స్ జట్టులో నిలిచారు. గోవా వేదికగా శుక్రవారం ప్రారంభమైన అండర్-21 గోవా గార్డియన్స్ ట్రోఫీలో బ్లాక్ హాక్స్ జట్టు శుభారంభం చేసింది. బెంగళూరుపై హైదరాబాద్ 3-0తో నెగ్గింది. హైదరాబాద్ 15-8, 15-13, 16-14తో హ్యాట్రిక్ సెట్లలో నెగ్గి, విజయం సాధించింది. ఈ ట్రోఫీలో బ్లాక్ హాక్స్ సహా పీవీఎల్‌లోని పది జట్లు పోటీ పడుతున్నాయి.

# ఓ కుటుంబ కథా చిత్రమ్...
## విశ్వనాథ్ అండ్ సన్స్

కొన్నేళ్లుగా కుటుంబ కథలు అరుదుగా తెరకెక్కుతున్నాయి. అగ్ర కథానాయకులైతే అటువైపు దృష్టిపెట్టడమే మానేశారు. ఈమధ్యే మళ్లీ ఆ కథలకు పూర్వ వైభవం వస్తున్నట్టు అనిపిస్తోంది. పలువురు యువ దర్శకులు కుటుంబ కథలపై మళ్లీ దృష్టిపెడుతున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ద్వారా అదే ప్రయత్నం చేశారు. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారసుడు. పేరున్న వ్యాపారవేత్త అయినా, 40 ఏళ్లు వచ్చినా వివాహం చేసుకోడు. తల్లి (రాధిక శరత్‌కుమార్) మాత్రం పెళ్లి చేసుకోవాలని, వారసుడిని కని ఇవ్వాలని పోరు పెడుతుంటుంది. దాంతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాబుని కని ఇంటికి తీసుకొస్తాడు. కానీ ఊహించని రీతిలో ఆ చిన్నారి అనారోగ్యానికి గురవుతాడు. చికిత్స చేసే క్రమంలో ఆ చిన్నారికి కన్నతల్లి అవసరం ఏర్పడుతుంది. దాంతో ఆమెని వెతుక్కుంటూ మళ్లీ అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. మరి తన బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? ఇంతకీ ఆమె ఎవరు? అమెరికా నుంచి ఇండియాకి రావడానికి అంగీకరిస్తుందా? లేదా? సంజయ్ పెళ్లి విషయంలో తన తల్లి కోరికని నెరవేర్చాడా?




సంజయ్ జీవితంలో మదన కామేశ్వరి అలియాస్ మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? తదితర విషయాలన్నీ హృద్యంగా చిత్రీకరించారు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం, భావోద్వేగాలున్న సినిమా ఇది. హృదయాల్ని హత్తుకునే ఓ కుటుంబ కథని తెరపైకి తీసుకొచ్చారు వెంకీ అట్లూరి. తన శైలి క్లాస్, పరిణతితో కూడిన రచనతో సూర్యలోని క్లాస్ నటుడిని ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకి హైలైట్. హీరో హీరోయిన్ల మధ్య వయసు తేడా, సరోగసీ ద్వారా కన్న బిడ్డతో ముడిపడిన భావోద్వేగాలు ఈ కథకు కొత్తదనం తీసుకొచ్చాయి. సంజయ్ – మ్యాడీ కలిసినప్పటి నుంచి సినిమాలో సందడే సందడి. ముఖ్యంగా సంజయ్ తల్లితో కలిసి మ్యాడీ చేసే అల్లరి చాలా బాగుంటుంది. కొన్ని సున్నితమైన సన్నివేశాల్ని దర్శకుడు డీల్ చేసిన తీరు చాలా బాగుంటుంది. సూర్య, మ్యాడీ బంధం ఏ తీరానికి చేరుతుందన్న ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్ధం మొదలవుతుంది. అయితే, కోర్ట్ సన్నివేశాలు, ఆ తర్వాత చోటు చేసుకునే నాటకీయ పరిణామాలతో వచ్చే సీన్లు పెద్దగా ఆకట్టుకోకపోగా కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే రాధిక పాత్ర నేపథ్యంలో వచ్చే మలుపుతో కథ అనూహ్యంగా మరో దారిని తీసుకుంటుంది. దాంతో సినిమా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. అంజలీదేవి (రవీనా టాండన్), ఆమె కూతురు, తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాల్లో కొన్ని భావోద్వేగాలు, నాజర్ పాత్రతో కొంత హాస్యం పండటం సినిమాకి కలిసొస్తుంది. ఈ కథకు ముగింపు కూడా క్లాస్‌గానే ఉంటుంది. ఇలాంటి కథలకు ఇదే సరైన ముగింపు అనిపిస్తుంది కానీ, మరింత హంగామా కోరుకునేవాళ్లకు అది సంతృప్తిని ఇవ్వకపోవచ్చు. సూర్యలోని క్లాస్ నటుడిని పూర్తిగా వాడుకున్న సినిమా ఇది. ఆయన పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. మ్యాడీగా మమిత బైజు నటన ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలం. విజువల్స్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు వెంకీ రచన, మాటలు చాలా బాగున్నాయి.

# అతీంద్రియ శక్తుల
# హార్రర్ స్టోరీ అగథ


ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగధ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగధ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగధ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగధకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగధ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచంతోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని అందుకుందీ చిత్రం. దైవ శక్తికీ, చీకటి శక్తికీ మధ్య సాగే పోరాటం చాలా సినిమాల్లో చూసినా అగధ చుట్టూ మలిచిన హారర్ సన్నివేశాలు, ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. హత్యల వెనకున్న అసలు కారణాల్ని మహాదేవి తనకు తెలిసిన విద్యల్ని ఉపయోగిస్తూ పరిశోధించే తీరు సినిమాకి హైలైట్. అసలు గుహలో ఉన్న అగధ ఎవరనే అంశంతోపాటు, ఆ రోజు గుహలోపల ఏం జరిగిందనే విషయాల చుట్టూ సాగే ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు రక్తికట్టిస్తాయి. ముఖ్యంగా కథానాయకుడి పాత్రలో రెండో కోణం, అగధ ఆత్మ తరచూ ఎవరో ఒకరిలోకి దూరిపోయి చేసే




హంగామా ఆకట్టుకుంటాయి. అయితే, కథలో ఒక దశ దాటిన తర్వాత ఇన్ని మలుపులా అనిపిస్తాయి. పతాక సన్నివేశాల్లో కాలయంత్రంతో ప్రతినాయకుడిని బంధీగా మార్చడమనే అంశం కొత్తగా ఉంటుంది. మొత్తంగా చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్ సినిమా అనుభూతిని పంచడంలో ఈ చిత్రం విజయం సాధించింది. కథకుడిగా కంటే దర్శకుడిగా సినిమాపై ప్రభావం చూపించారు ఎం.ఎస్.రాజు. అతీత శక్తులతో కూడిన కథా నేపథ్యం ఆసక్తిని రేకెత్తించినా, కథన రచన పాత పద్ధతుల్లోనే సాగింది. నిర్మాతగా ఆయన సినిమాల్లో కనిపించిన ప్రమాణాలకు తగ్గట్టుగానే, దర్శకుడిగా ఈ సినిమాని నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చారు.




# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది
## నటుడు యశ్ ప్రశంసలు



సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి'
## గా విక్టరీ వెంకటేశ్.. పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌తో అంచనాలు డబుల్!




విక్టరీ వెంకటేశ్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న ఐదవ సినిమాపై నెలకొన్న అంచనాలను మరింత పెంచుతూ, చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులకు కానుకగా రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌లో వెంకటేశ్ పవర్ ఫుల్ ఆర్మీ ఆఫీసర్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్ 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. కౌంటర్ టెర్రరిజం, బందీలను విడిపించడంలో నిపుణుడైన సైనికాధికారిగా ఆయన పాత్ర ఉండబోతోందని ఫస్ట్ లుక్ స్పష్టం చేస్తోంది. 1986లో 'కలియుగ పాండవులు' చిత్రంతో అరంగేట్రం చేసిన వెంకటేశ్, సినీ పరిశ్రమలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంలో ఈ పోస్టర్‌ను విడుదల చేయడం విశేషం.ఇప్పటికే ఖీ2, ఖీ3, సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు.. వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ఈ కాంబోలో ఇది ఐదో సినిమా కావడంతో ప్రేక్షకులు, ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నందమూరి కల్యాణ్ రామ్ మరో హీరోగా నటిస్తుండటం అదనపు ఆకర్షణ. వీరి సరసన హీరోయిన్లుగా కీర్తి సురేశ్, కృతి శెట్టి నటిస్తున్నారు.షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, అనుకున్న సమయానికే చిత్రాన్ని పూర్తి చేయాలని చిత్రబృందం భావిస్తోంది. హిట్ కాంబినేషన్, భారీ తారాగణం, పండుగ సీజన్ విడుదల వంటి అంశాలతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్

టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. లాంచింగ్ రోజే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.

